## వార్డెన్‌ను విచారించిన అటవీశాఖ అధికారులు



ఎల్లారెడ్డి అటవీశాఖ కార్యాలయంలో ఎస్సీ బాలికల వసతిగృహం వార్డెన్‌ను విచారిస్తున్న అటవీశాఖ అధికారులు

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 21: ఎల్లారెడ్డి అటవీశాఖ కార్యాలయంలో ఎస్సీ బాలికల వసతిగృహం వార్డెన్ శారదను జిల్లా కేంద్రం నుంచి వచ్చిన అటవీ శాఖ స్ట్రైకింగ్ ఫోర్స్ బృందం, ఎల్లారెడ్డి అటవీశాఖ అధికారులు సోమవారం విచారించారు. వార్డెన్‌ను విచారించిన అనంతరం ఎల్లారెడ్డి ఎఫ్ఆర్వో ఓంకార్ మాట్లాడుతూ.. ఎస్సీ బాలికల వసతిగృహంలో నాలుగు టేకు చెట్లను నరికివేసిన విషయంపై వార్డెన్‌తో మాట్లాడగా.. కోతుల బెడద ఉండడంతో విద్యార్థులకు ఇబ్బంది కావద్దని చెట్లను నరికివేయించానని తెలిపారన్నారు. వార్డెన్ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసి, టేకు దుంగలు, చెట్టు మొదళ్లను పరిశీలించిన తర్వాత ఆమెపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నివేదికను తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు పంపనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారులు డీఆర్వో అనురంజని, సెక్షన్ ఆఫీసర్ గోపాల్, అటవీశాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మెడికల్ కళాశాలల అవకతవకలపై విచారణలో జాప్యం ఎందుకు?



అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కామారెడ్డి, ఏప్రిల్ 21 : కామారెడ్డి మెడికల్ కళాశాలలో జరిగిన అవకతవకలపై విచారణలో జాప్యం చేస్తున్నారని, అధికారులు స్పందించడం లేదని నిరసనగా జిల్లా కేంద్రంలో మున్సిపల్ ఆవరణలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి విద్యార్థి సంఘాల నాయకులు సోమవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అవుట్ సోర్సింగ్ నియామకాల అవినీతిపై 25 రోజులుగా పోరాటం చేస్తున్నా కలెక్టర్ నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం సరికాదన్నారు. దీనిపై ప్రభుత్వం వెంటనే విచారణ చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు నాగరాజు, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్ నాయక్, నాయకులు లావుడ్య రవి, అరవింద్, సురేశ్, సంజయ్, గణేశ్, పీర్యా, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

# భూభారతితో సమస్యలు పరిష్కారం

**కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్**



పర్మళ్ల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

లింగంపేట, ఏప్రిల్ 21 : భూభారతి చట్టం ద్వారా భూ సమస్యలు పరిష్కారం కానున్నట్లు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని పర్మళ్ల గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. గతంలో పెండింగ్‌లో ఉన్న సమస్యలను భూభారతి చట్టం ద్వారా పరిష్కరించనున్నట్లు తెలిపారు. పర్మళ్ల గ్రామానికి చెందిన రైతులతో ముఖాముఖి నిర్వహించారు. గ్రామంలోని రైతుల సమస్యలను కలెక్టర్ నేరుగా తెలుసుకున్నారు. భూ సమస్యలు ఉన్న రైతులు దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను పరిశీలించి, గ్రామాల్లో విచారణ చేపట్టి పరిష్కరించనున్నట్లు వెల్లడించారు. మండలంలోని పోల్కంపేట గ్రామంలో 170 దరఖాస్తులు, పర్మళ్లలో 173 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సురేశ్ తెలిపారు. కలెక్టర్ వెంట ఎల్లారెడ్డి ఆర్డీవో మన్నె ప్రభాకర్, తహసీల్దార్ సురేశ్, గిర్దావర్ కిరణ్‌తోపాటు రెండు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

**భూ భారతి చట్టంపై అవగాహన..**

పెద్దకొడప్‌గల్(పిట్లం), ఏప్రిల్ 21 : భూముల సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం భూ భారతి చట్టం ప్రవేశపెట్టిందని కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అన్నారు. పిట్లం, పెద్దకొడప్‌గల్ మండలాల్లోని రైతు వేదికల్లో సోమవారం భూ భారతి చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా రైతులకు భూ భారతి చట్టానికి సంబంధించిన నివేదికను బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి చదివి వినిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మాట్లాడుతూ.. రైతులు భూ భారతి చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, మండల ప్రత్యేకాధికారులు కిషన్, వామన్ రావు, తహసీల్దార్లు దశరథ్, రాజ నరేందర్‌గౌడ్, ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి, కమలాకర్, ఏవోలు కిషన్, కమల, నాయకులు, రైతులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కల్తీకల్లు, డ్రగ్స్ నివారణపై ప్రత్యేక నిఘా

**ఎస్పీ రాజేశ్ చంద్ర**



లింగంపేటలో గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ రాజేశ్‌చంద్ర

లింగంపేట, ఏప్రిల్21: జిల్లాలో కల్తీ కల్లు, డ్రగ్స్ నిరోధించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్పీ రాజేశ్ చంద్ర వెల్లడించారు. ఎల్లారెడ్డి డివిజన్ పరిధిలోని లింగంపేట, నాగిరెడ్డిపేట పోలీస్ స్టేషన్లను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కల్తీ కల్లు విక్రయిస్తున్న డిపోలను సీజ్ చేసినట్లు వెల్లడించారు. కల్తీ కల్లు గుర్తించడానికి ప్రత్యేక కిట్లు అందుబాటులోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. ఆకస్మిక తనిఖీలు చేపట్టి, కల్లు పరీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గత సంవత్సరం రోడ్డు ప్రమాదాల్లో సుమారు 270 మంది మృతి చెందినట్లు వెల్లడించారు. గడిచిన నాలుగు నెలల వ్యవధిలో 70 మంది మృతి చెందినట్లు తెలిపారు. డబ్బులు పోగొట్టుకున్న బాధితులకు సంబంధించి ఇప్పటి వరకు 20శాతం డబ్బులు రికవరీ చేసినట్లు వెల్లడించారు. క్రికెట్ బెట్టింగ్‌లపై దృష్టి సారించామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో సైబర్ నేరాల బారిన పడకుండా కళాజాత బృందం సభ్యులతో ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విదేశాలకు చెందిన వారు సైబర్ నేరాలకు పాల్పడుతున్నట్లు వివరించారు. ఎస్పీ వెంట ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస రావు, లింగంపేట ఎస్సై వెంకట్‌రావు, నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డితోపాటు పోలీసు సిబ్బంది ఉన్నారు.

**ఎక్స్‌గ్రేషియా చెక్కు అందజేత**

కామారెడ్డి, ఏప్రిల్ 21 : పోలీసు భద్రత పథకం పోలీసు కుటుంబాల్లో కొత్త వెలుగులు నింపుతూ, ఆర్థిక భరోసా కల్పిస్తున్నదని ఎస్పీ రాజేశ్‌చంద్ర అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన కానిస్టేబుల్ డి.రామన్ కుటుంబానికి పోలీసు భద్రత నుంచి మంజూరైన రూ.ఎనిమిది లక్షల చెక్కును భార్య అనురాధ, కూతురు అఖిలకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. మృతి చెందిన పోలీసుల కుటుంబాలకు పోలీస్ శాఖ అన్ని రకాలుగా అండగా నిలుస్తున్నదని తెలిపారు. ప్రభుత్వం ద్వారా వారికి రావాల్సిన అన్ని రకాల లబ్ధిని సాధ్యమైనంత త్వరగా ఇప్పించేలా కృషి చేస్తామని అన్నారు. భద్రత స్కీమ్ ద్వారా చనిపోయిన పోలీసు కుటుంబాలకు ఆర్థిక భరోసా కలుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ ఏవో అఫ్సరుద్దీన్, సూపరింటెండెంట్ నయీం పాల్గొన్నారు.

**కానిస్టేబుళ్లకు ఎస్పీ అభినందన**

పిట్లం ఊర చెరువులో ఆదివారం సునీత అనే మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడగా ఆ మహిళా ప్రాణాలను కాపాడిన కానిస్టేబుల్ రవిచంద్ర, హోంగార్డు మారుతిని సోమవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో ఎస్పీ రాజేశ్‌చంద్ర అభినందించారు. వీరి ధైర్యసాహసాలు పోలీసు శాఖకు మరింత గౌరవం తెచ్చిపెట్టాయని అన్నారు. కానిస్టేబుళ్లు రవిచంద్ర, హోంగార్డు మారుతికి నగదు పురస్కారాన్ని అందజేశారు. అత్యుత్తమ సేవలు అందించిన సిబ్బందిని ఎల్లప్పుడూ గుర్తిస్తామని అన్నారు.

## ఉద్యోగిపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

కామారెడ్డి, ఏప్రిల్ 21 : మాచారెడ్డి మండలంలోని ఘన్‌పూర్ గ్రామానికి చెందిన సాడెం కుమార్‌పై పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట గ్రామశివారులో సోమవారం గుర్తుతెలియని వ్యక్తులు దాడి చేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. సాడెం కుమార్ మెదక్ లోని మున్సిపల్‌లో ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ప్రతిరోజూ బైక్‌పై పాల్వంచ మండలంలోని ఫరీద్‌పేట, దోమకొండ మీదుగా మెదక్ వెళ్తాడు. రోజూ మాదిరిగానే బైక్‌పై వెళ్తుండగా ఫరీద్‌పేట గ్రామశివారులో గుర్తుతెలియని ముగ్గురు వ్యక్తులు ఇనుప రాడ్లతో దాడి చేస్తుండగా అదే రహదారిపై ఫరీద్‌పేట గ్రామానికి చెందిన పల్లె రమేశ్‌గౌడ్ కారులో వస్తున్నాడు. అతను కారు ఆపడంతో దుండగులు పారిపోయారు. గాయపడ్డ కుమార్‌ను వెంటనే అంబులెన్స్‌లో కామారెడ్డిలోని ప్రైవేట్ దవాఖానకు తరలించగా చికిత్స పొందుతున్నాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి

బీబీపేట్, ఏప్రిల్ 21 : బీబీపేట, దోమకొండ మండలా ల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఉన్న ఆలయాలు, మసీదులు, చర్చిల్లో సీసీ కెమెరాలను తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఎస్సైలు ప్రభాకర్, స్రవంతి సూచించారు. సోమవారం పోలీస్ స్టేషన్లలో ఆలయాల కమిటీ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సైలు మాట్లాడుతూ.. ఆలయాలు, మసీదులు, చర్చిల్లో భద్రతపై పలు సూచనలు చేశారు, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని నోటీసులు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఆయా కమిటీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు

## బోరుమోటరు ప్రారంభం

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 21 : మండలంలోని హాజీపూర్ తండాలోని జగదాంబా సేవాలాల్ ఆలయం వద్ద నూతన బోరు మోటరును సోమవారం ప్రారంభించారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలుగుతున్నందున, సమస్యను గమనించిన స్థానిక ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు ఆలయం వద్ద నూతన బోరు వేయించి, కొత్త మోటరు బిగించి ప్రారంభించినట్లు తండా పెద్దలు తెలిపారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

రామారెడ్డి(గాంధారి), ఏప్రిల్ 21 : గాంధారి మండలం చద్మల్‌తండా గ్రామానికి చెందిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకున్నది. స్థానిక ఎస్సై ఆంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం.. మాండు జీవన్(45) తన అత్తగారి ఊరైన గురజాల తండాకు వచ్చాడు. రామలక్ష్మణపల్లి గ్రామ శివారులో ఉన్న అత్తగారి వ్యవసాయ పొలానికి తన ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరిగి వస్తుండగా బ్రాహ్మణపల్లి గేటు సమీపంలో వాహనం అదుపుతప్పి రోడ్డుపై పడిపోయాడు. దీంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య కమల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## జొన్నలు కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కవిత

బిచ్కుంద, ఏప్రిల్ 21 : జొన్నలను కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని, దళారులను నమ్మి మోసపోవద్దని బిచ్కుంద మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కవిత అన్నారు. బిచ్కుందలోని మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో మార్క్‌ఫెడ్ సౌజన్యంతో రైతుసేవా సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సోమవారం సొసైటీ చైర్మన్ నాల్చర్ బాలాజీతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం మద్దతు ధర క్వింటాలుకు రూ.3,371 ప్రకటించిందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ యాదారావు, సీనియర్ నాయకుడు గోపాల్‌రెడ్డి, సొసైటీ డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

## 'మద్యం తాగి వాహనాలు నడపొద్దు'



గొల్లపల్లి చౌరస్తాలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

రామారెడ్డి, ఏప్రిల్ 21 : మద్యం తాగి వాహనాలు నడపవద్దని ఎస్సై నరేశ్ వాహనదారులకు సూచించారు. రామారెడ్డి మండలం గొల్లపల్లి చౌరస్తా వద్ద ఎస్పీ రాజేశ్‌చంద్ర ఆదేశానుసారం సోమవారం ఎస్సై ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ నిర్వహించారు. నంబర్ ప్లేట్, డ్రంక్అండ డ్రైవ్, పాత చలాన్లు పరిశీలించారు. రామారెడ్డి పోలీసుతోపాటు మల్టీ టీంల సహకారంతో పలువురు వాహనదారులకు జరిమానా విధించారు. డ్రంక్ అండ్ డ్రైవ్‌లో కేసు నమోదు చేశామని తెలిపారు. హెల్మెట్, నంబర్ ప్లేట్ లేని వాహనాలకు జరిమానాలు విధించామని ఎస్సై తెలిపారు.

## దివ్యాంగులకు కిట్ల పంపిణీ

లింగంపేట(తాడ్వాయి), ఏప్రిల్ 21 : తాడ్వాయి మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన ది వ్యాంగులకు కిట్లను పంపిణీ చేసినట్లు మండల విద్యాశాఖ అధికారి రామస్వామి తెలిపారు. ది వ్యాంగులైన ఐదుగురు విద్యార్థులకు ఒక్కొక్కరికీ 20 వేల రూపాయలు విలువ చేసే కిట్లను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. ఫిజియోథెరపిస్టు నవీన్ సాయి, ఐఈఆర్పీ భక్తమాలతోపాటు దివ్యాంగ విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## మృతదేహం అప్పగింత

బిచ్కుంద, ఏప్రిల్ 21 : మండల కేంద్రానికి చెందిన చిల్లెల గంగారాం మృతదేహాన్ని నిజామాబాద్‌లోని ప్రభుత్వ మెడికల్ కళాశాలకు కుటుంబ సభ్యులు సోమవారం అప్పగించారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ.. మృతదేహాన్ని వైద్య విద్యార్థులకు శిక్షణ నిమిత్తం ఉపయోగపడుతుందన్న సదుద్దేశంతో అప్పగించినట్లు తెలిపారు. సుశీల్ పటేల్, నిరక్షిత్, హన్మంత్, డాక్టర్ కాశినాథ్, యోగేశ్, సాయినాథ్, అనిత, నరేంద్ర పాల్గొన్నారు.

# ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలి

- అదనపు కలెక్టర్ విక్టర్
- 'ప్రజావాణి'కి 108 ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ విక్టర్

కామారెడ్డి, ఏప్రిల్ 21 : ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను త్వరగా పరిష్కరించాలని అదనపు కలెక్టర్ విక్టర్ ఆయా శాఖల అధికారులకు సూచించారు. కామారెడ్డి సమీకృత కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫిర్యాదులను సంబంధిత శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలని చెప్పారు. ప్రజావాణిలో భూ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వచ్చే ఫిర్యాదులను రెవెన్యూ అధికారులు తక్షణమే పరిష్కరించాలన్నారు. ప్రజావాణిలో నుంచి 108 వినతులను స్వీకరించామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చందర్, ఆర్డీవో వీణ, కలెక్టర్ పరిపాలన అధికారి మసూద్ అహ్మద్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**ప్రజావాణిలో ఒక ఫిర్యాదు**

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 21: ప్రజావాణిలో ఒక ఫిర్యాదు వచ్చినట్లు విద్యుత్‌శాఖ డీఈ విజయసారథి తెలిపారు. ఎల్లారెడ్డిలోని విద్యుత్ శాఖ డివిజినల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో పట్టణానికి సంబంధించిన విద్యుత్ సమస్యపై ఒక ఫిర్యాదు వచ్చినట్లు ఆయన తెలిపారు. రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదులు రాలేవని తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. సమస్యలు ఉన్న వారు ప్రజావాణిలో ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చని ఆయన అన్నారు.

## పశువులకు తప్పకుండా టీకాలు వేయించాలి



బ్రాహ్మణ్‌పల్లిలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు చేస్తున్న డాక్టర్ అర్చన

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 21: ప్రతి రైతు తప్పనిసరిగా తన వద్దనున్న పశువులకు టీకాలను వేయించాలని పశువైద్యురాలు డాక్టర్ అర్చన అన్నారు. ఎల్లారెడ్డి మండలం బ్రాహ్మణ్‌పల్లి, జంగమాయిపల్లి, వెల్లుట్ల, వెల్లుట్లతండాలో సోమవారం పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... నాలుగు గ్రామాలకు చెందిన 70 మంది రైతుల వద్ద ఉన్న 177 ఆవులు, 241 బర్రెలకు టీకాలు వేసినట్లు తెలిపారు. ఆమెతోపాటు గోపాలమిత్ర సాయిరెడ్డి, పశువైద్య సిబ్బంది, ఆయా గ్రామాలకు చెందిన రైతులు ఉన్నారు.

## 27న మాడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష

రామారెడ్డి(సదాశివనగర్), ఏప్రిల్ 21 : సదాశివనగర్ మండలంలోని మాడల్‌స్కూల్‌లో ప్రవేశానికి ఈ నెల 27న పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాజిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరైయే విద్యార్థులు 21వ తేదీ నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని తెలిపారు. 6వ తరగతి విద్యార్థులకు ఉదయం 10 నుంచి 12 గంటల వరకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. 7 నుంచి 10వ తరగతి వరకు మధ్యాహ్నం 2 నుంచి సాయత్రం 4 గంటల వరకు పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని తెలిపారు. telangams.cgg.gov.in వైబ్‌సెట్ నుంచి హాల్ టికెట్లు డౌన్ లోడ్ చేసుకోవాలని సూచించారు.

**ఆదర్శ పాఠశాలలో..**

నిజాంసాగర్, ఏప్రిల్ 21 : తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాలలోకి 2025-26 సంవత్సరానికి ప్రవేశ పరీక్ష ఈ నెల 27వ తేదీన నిర్వహిస్తున్నట్లు తెలంగాణ రాష్ట్ర ఆదర్శ పాఠశాలల అదనపు డైరెక్టర్ శ్రీనివాస్ చారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ప్రవేశ పరీక్షకు సంబంధించిన హాల్‌టికెట్లను ఈ నెల 21 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఆయన తెలియజేశారు.

## బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

నస్రుల్లాబాద్, ఏప్రిల్ 21 : బీర్కూర్ మండలం దామరంచ గ్రామ సమీపంలో బైక్ అదుపుతప్పి బీర్కూర్ గ్రామానికి చెందిన అనిల్ (37) మృతి చెందినట్లు ఏఎస్సై సీతారామమ్మ తెలిపారు. మృతుడు వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం పని నిమిత్తం బాన్సువాడకు వెళ్తుండగా దామరంచ సమీపంలో బైక్ అదుపుతప్పి పడిపోయాడు. దీంతో తలకు బలమైన గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో బాన్సువాడ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషంగా ఉండడంతో నిజామాబాద్ దవాఖానకు తరలించారు. చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి భార్య ఝాన్సీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

# ఉద్యోగ భద్రత కల్పించాలి



ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులు

భిక్కనూరు, ఏప్రిల్ 21 : ఉద్యోగ భద్రత కల్పించాలని, తర్వాతే నూతన నియామకాలు చేపట్టాలని తెలంగాణ విశ్వవిద్యాలయ దక్షిణ ప్రాంగణ కాంట్రాక్ట్ అధ్యాపకులు రాష్ట్ర ఉన్నత మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణారెడ్డికి వినతి పత్రం అందజేశారు. సౌత్ క్యాంపస్‌లో రాష్ట్ర కో ఆర్డినేషన్ కమిటీ పిలుపు మేరకు నిరవధిక సమ్మె కొనసాగుతున్నది. ఈ సందర్భంగా ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణారెడ్డి ప్రాంగణానికి సోమవారం వచ్చారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ అధ్యాపకులు ఆయానకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విశ్వ విద్యాలయ రాష్ట్ర కో ఆర్డినేషన్ నారాయణ, యాలాద్రి, సునీత, నర్సయ్య, రమాదేవి, శ్రీకాంత్, నిరంజన్, దిలీప్, సరిత తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శికి సన్మానం

ఎల్లారెడ్డి రూరల్, ఏప్రిల్ 21 : ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి పద్మారావుకు మండల కమిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని మార్కెట్ కమిటీ హాల్‌లో సోమవారం సన్మానించారు. 30 ఏండ్లుగా మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆధ్వర్యంలో సుదీర్ఘ పోరాటం చేస్తున్న పద్మారావుకు పూలమాలలు వేసి, శాలువాలు కప్పి సన్మానించారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు శివానందం, ఉపాధ్యక్షుడు ఎల్లుబాబు, నాయకులు రాజు, మానయ్య, సామెల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య

లింగంపేట(తాడ్వాయి), ఏప్రిల్ 21 : తాడ్వాయి మండలం కాళోజీవాడి గ్రామానికి చెందిన మల్లమరి రాకేశ్ (25) ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాజ య్యా తెలిపారు. సదాశివనగర్ మండలంలోని పోసానిపేట గ్రామానికి చెందిన సంధ్యతో ఐదేండ్ల క్రితం వివాహం జరిగిందన్నారు. రెండేండ్ల నుంచి కుటుంబ కలహాల కారణం గా రాకేశ్ భార్య సంధ్య తల్లిగారింటికి వెళ్లిపోయింది. అప్పటి నుంచి మనస్థాపానికి గురయ్యాడు. గతంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. సోమవారం మధ్యాహ్నం గ్రామ శివారులోని తన వ్యవసాయ పొలంలో చెట్టుకు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తండ్రి శివరాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు తెలిపారు. మృతుడికి భార్య సంధ్య, కుమారుడు అనూశ్ ఉన్నట్లు ఎస్సై తెలిపారు.

**నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకి మరో వ్యక్తి..**

నిజాంసాగర్, ఏప్రిల్ 21 : నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన నిజాంసాగర్ మండల కేంద్రంలో సోమవారం చోటు చేసుకున్నది. నిజాంసాగర్ ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బోధన్ పట్టణంలోని శక్కర్‌నగర్‌కు చెందిన అబ్దుల్ సలాం(37) ఆదివారం రాత్రి నిజాంసాగర్ ప్రాజెక్టులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి సోదరుడు అబ్దుల్ రెహమాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



కాలిపోయిన సరుకులు, వంటపాత్రలు

బిచ్కుంద(జుక్కల్), ఏప్రిల్ 21 : జుక్కల్ మండలంలోని గుండూర్ గ్రామంలో ఆదివారం అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో ఓ ఇల్లు దగ్ధమైంది. రెవెన్యు, అగ్నిమాపక అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. గుండూర్ గ్రామానికి చెందిన దుంపల్‌వార్ సుమిత్ర ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇంట్లో మంటలు చెలరేగాయి. దీంతో ఇంట్లో ఉన్న సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. ఇల్లు మొత్తం దగ్ధమైంది. ఇంట్లో ఉన్న వస్తువులు, బీరువాలో ఉన్న సామగ్రి, తినుబండారాలు, దుస్తులు పూర్తిగా కాలిపోయాయి. ఇంటి ఆవరణలో కట్టేసిన గేదెలు, ఆవులు మంటలకు భయపడి దూరంగా వెళ్లిపోయాయి. ఒక లేగ దూడతోపాటు 15కోళ్లు అగ్నికి ఆహుతయ్యాయి. గ్రామస్తులు గమనించి నీటితో మంటలను ఆర్పేప్రయత్నం చేయగా అదుపులో రాక పోవడంతో మద్నూర్ అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను పూర్తిగా ఆర్పివేశారు. విషయం తెలుసుకున్న రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామారావు ఘటనా స్థలానికి చేరుకొని పంచనామా నిర్వహించారు. రూ.6లక్షల ఆస్తి నష్టం జరిగిందన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు సమర్పిస్తామన్నారు. ఇల్లు పూర్తిగా కాలిపోవడంతో సుమిత్ర కుటుంబం కట్టు బట్టలతో బయటే ఉన్నారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, NAZIA SULTANA, W/o. Mirza Shamshad Baig, R/o. 4-3-420/1A/1, Shakkar Nagar, Bodhan, Nizamabad, Telangana. Changed My Minor Child Daughter Name from MIRZA YUSRA FAZAL to YUSRA MIRZA.
NT-342752

సర్వీసు బుక్ పోయినది
టి.వైకుంఠం (Rtd.M.N.O.) గవర్నమెంట్ యూనాని హాస్పిటల్ నిజామాబాద్ (H.Q) నందు హాస్పిటల్ బిల్డింగ్ కూలి పోయినది తరువాత పాత బిల్డింగ్ నుండి కొత్త బిల్డింగ్ మార్చిన సమయంలో సర్వీసు బుక్ పోయినది. కావున దొరికిన వారు ఈ నెంబర్‌కు సంప్రదించగలరు. సెల్: 9573076370

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.